క్లుప్తంగా

నర్సింగ్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ


కమలకుమారి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చలువాది కమల కుమారి మంగళవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో నర్సింగ్ కోర్సు అభ్యసించిన ఆమె సుమారు 39 సంవత్సరాల పాటు స్టాఫ్‌నర్సుగా, హెడ్‌నర్సుగా నర్సింగ్ సూపరింటెండెంట్‌గా వివిధ హోదాల్లో రోగులకు వైద్య సేవలు అందించారు. పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ఆస్పత్రిలోని శుశ్రుత హాలులో కమలకుమారిని ఘనంగా సన్మానిస్తున్నట్లు నర్సింగ్ సిబ్బంది తెలిపారు.

కృష్ణసాయికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ విభాగ పరిశోధకుడు టీవీ కృష్ణసాయికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఫార్మసీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ పి.రవి పర్యవేక్షణలో 'ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ న్యూరోఫార్మాకాలాజికల్ స్టడీస్ ఆన్ సర్టెయిన్ ట్రెడిషినల్ ప్లాంట్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను కృష్ణసాయికి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

జై భీమ్ పుస్తకావిష్కరణ



నెహ్రూ నగర్: జై భీమ్ పుస్తకాన్ని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. బొంగరాలబీడులో చారువాక యువజన సంఘం అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్ ఆధ్వర్యంలో దళిత శ్రీ సాహితీ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రచించిన జై భీమ్ పుస్తకాన్ని అప్పి రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని విలియమ్స్ పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ ఏకైక లక్ష్యమని ఈ సందర్భంగా విలియమ్స్ పేర్కొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తొలుత నటరాజ పూజ, నృత్య నివేదనంగా 108 మంది శరణం భవకరుణామయ తరంగాన్ని సంప్రదాయ దుస్తులతో నర్తించారు. సాయంత్రం జరిగిన సభకు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, బూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పలువురు కళాకారులు నృత్యప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేతం ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, పసుమూర్తి రామలింగేశ్వరశాస్త్రికి కూచిపూడి నాట్య విద్వాంసులు పసుమూర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారం అందించారు. యువ కళారత్న పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, పెద్ది మాధవి, రాధిక పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపై బాబు గాలిమేడలు

- అధికారం కోసం చంద్రబాబు ఎంతటి నీచానికైనా దిగజారుతారు
- వైఎస్ జగన్‌కు ప్రాణహాని తలపెడతారేమోనని ప్రజల ఆందోళన
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 30వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమం


మంత్రి రజినికి హారతులు పడుతున్న స్థానిక మహిళలు

పట్నంబజారు: అబద్ధాల పునాదులపై గాలిమేడలు కట్టడం చంద్రబాబునాయుడికి వెన్నతోపెట్టిన విద్య అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 30వ డివిజన్ ఏటీ అగ్రహారంలో సోమవారం మనతో మన రజినమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఓట్ల కోసం అలవి కాని వాగ్దానాలు చేయకుండా, నిజాలు నిర్భయంగా చెప్పి, కచ్చితంగా తాను ఏవి చేయగలడో అవి మాత్రమే మేనిఫెస్టోలో పెట్టిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా ఆడతారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో కలసి ఎన్నికలకు వచ్చేందుకైనా సిద్ధపడతారని, ఎన్ని కుట్రలకైనా పాల్పడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతటి దిగజారుడు రాజకీయాలకు వెనుకాడరని, ఆదివారం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ "జగన్.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది?' అంటూ అత్యంత అహకారంతో, వ్యవస్థలంటే గౌరవాన్ని కోల్పోయి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు వ్యాఖ్యలు అతడి బరితెగింపు చర్యలకు అద్దంపడుతోందన్నారు. సీఎం జగన్‌పై విజయవాడలో దాడి జరగడానికి ముందు రోజు చంద్రబాబు తాడికొండ సభలో జగన్‌ను ఉద్దేశిస్తూ 'జగన్‌ను మనిషికి ఒక రాయి తీసుకుని కొట్టండి' అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారని, ఆ తర్వాతే దాడి జరిగిందని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి చంద్రబాబునాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారని, దీంతో రాష్ట్ర ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం..

మంత్రి రజిని ఉదయం ఏటీ అగ్రహారం 8వ లైను నుంచి 12వ లైను వరకు, శ్రీరామ్ నగర్‌లో మూడు లైన్‌లలో పర్యటించారు. సాయంత్రం తిరిగి అదే డివిజన్‌లో ఏటీ అగ్రహారం 14వ లైను నుంచి 20వ లైను వరకు, హనుమాన్ నగర్ 1వ లైను నుంచి ఏడవ లైను వరకు పర్యటించారు. పర్యటనలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వనజాక్షి, వెంకటరెడ్డి, కోటయ్య, లక్ష్మారెడ్డి, కాలేషా, నరేష్ సింగ్, అరవింద్, మల్లి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాయి, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ అజెండా

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: సంక్షేమం, అభివృద్ధి తమ అజెండా అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక శ్యామలానగర్ లోని మంత్రి విడదల రజిని నివాసానికి సోమవారం వందలాది మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ మంత్రి విడదల రజిని పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఏటీ అగ్రహారంలో..

జనసేన పార్టీకి చెందిన బీమా శ్రీనివాసరావు పది కుటుంబాలతో కలసి సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి విడదల రజిని ప్రచారం కోసం వెళ్లిన సమయంలో ఈ చేరికలు జరిగాయి.

సుబ్బారెడ్డి నగర్, నల్లగుంట నుంచి

వడ్డెరలు, రాజులు కుటుంబాలకు చెందిన 70 మంది టీడీపీ నుంచి పార్టీలో చేరారు. ఈ చేరికలు మంత్రి నివాసంలో జరిగాయి. చల్లా రామయ్య, చల్లా జగదీష్, గోగుల వెంకటేశ్వరరావు, రాయల బాజి, రాయల వెంకటరత్నం, రాయల బాబూరావు, రాయల నాగరాజు, రాయల నాగేశ్వరరావు, ఓర్సు వెంకటేశ్వరరావు, గోగుల వెంకటేశ్వరరావు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. విడతల సాంబశివరావు యాదవ్, తమ్మిశెట్టి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

20వ డివిజన్ నుంచి..

20వ డివిజన్ నల్లచెరువు నుంచి ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకుల వైఎస్సార్ సీపీలో చేరారు. తెలుగుదేశంపార్టీ నగర ఉపాధ్యక్షుడు జానీ, టీడీపీ బూత్ కన్వీనర్ జాఫర్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు.

49వ డివిజన్ నుంచి

49వ డివిజన్ మల్లికార్జునరావుపేట, పోస్టల్ కాలనీ, 43వ డివిజన్ ముత్యాలరెడ్డినగర్ నుంచి మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. టీడీపీ నుంచి దాదాపు 30 మంది వరకు పార్టీ కండువాలు కప్పుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేరం చంటి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. వట్టిగుంట కుమారి, రాచమళ్ల సుశీల, గోగోలు నాగలక్ష్మీ, శనగల కోటేశ్వరమ్మ, అంబోతు విజయాబాయ్, షేక్ జాన్‌బీ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

17 నుంచి బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మే నెల 17వ తేదీ నుంచి బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ జీ.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, వయో పరిమితి 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వివరించారు.

మే ఒకటో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ

నెహ్రూ నగర్: పెన్షన్ దారులు పింఛన్ల కోసం సచివాలయాలకు వచ్చే అవసరం లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇంటి వద్దకే వచ్చి అందించడం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మే, జూన్ నెలల సామాజిక భద్రతా పింఛన్‌లను బ్యాంక్ ఖాతాల్లో జమ, కొందరికి ఇంటి వద్దనే అందించాలని మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. గుంటూరు నగరంలోని పింఛన్ దారులకు 75 శాతం వారి బ్యాంక్ అకౌంట్‌లకు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. మిగిలిన 25 శాతం మందికి బీఎల్‌ఓ విధులు లేని సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంల ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. మే 1వ తేదీ నుండి 5 వ తేదీ లోపు పంపిణీ పూర్తి చేసేలా నోడల్ అధికారులు, అడ్మిన్ కార్యదర్శులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పింఛన్ నగదు బ్యాంక్ నుంచి తెచ్చేప్పుడు, పంపిణీ చేసే సమయంలో తప్పనిసరిగా ఆథరైజేషన్ లెటర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ధరలు పెంచకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

లక్ష్మీపురం: సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చే వాటిని పార్టీలు పోటీ పడి ప్రకటిస్తున్నాయని, అదికాకుండా ప్రజల నుంచి పన్నులు ధరలు పెంచి ఎంత వసూలు చేస్తారో చెప్పాలని ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీల మేనిఫెస్టోలపై చర్చగోష్ఠి నిర్వహించారు. విద్యావేత్త ఎస్.రవిబాబు మాట్లాడారు.

పశ్చిమ ఎన్నికల బరిలో 28 మంది

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నామినేషన్ల పరిశీలన అనంతరం ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారని, 28 మంది అభ్యర్థులు తుది పోటీలో ఉన్నారని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సమయం అనంతరం తుది అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లతో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ఖర్చుల నమోదు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముగ్గురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని చెప్పారు. మే 13 నిర్వహించనున్న ఎన్నికల్లో 28 మంది అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థుల సమక్షంలోనే గుర్తులు కేటాయింపు చేశామని, ఒక గుర్తుని ఒక్కరికంటే అదనంగా అడిగినవాటికి లాటరీ ద్వారా కేటాయింపు చేయుట జరిగిందన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సీనారెడ్డి, సి.హెచ్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ లు సాంబశివరావు పాల్గొన్నారు.

నెహ్రూ నగర్: ఎన్నికల ఖర్చులను సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను తమకు అందించిన ఎన్నికల ఖర్చుల రిజిస్టర్‌లో నమోదు చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు అనంతరం 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఖర్చులు నమోదు చేసిన రిజిస్టర్ ని, బిల్లులు, ఓచర్లను మే నెల 1, 5, 10 తేదీల్లో ఎన్నికల వ్యయ పరిశీలకుల తనిఖీకి అందించాలని తెలిపారు. అభ్యర్థులు లేదా అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ తప్పనిసరిగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకునితో తనిఖీ చేయించుకోవాలని, లేకుంటే 1951 భారత ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 10(ఏ) ప్రకారం అనర్హతకు గురి అవుతారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి
- 55వ డివిజన్‌లో ప్రచారం


స్థానికులతో మాట్లాడుతున్న విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా షేక్ నూరిఫాతిమా, గుంటూరు ఎంపీగా కిలారి రోశయ్య గెలుపు నల్లేరుపై నడకేనని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఈ నేపథ్యంలో భారీ మెజారిటీ పైనే తాము గురి పెట్టినట్లు తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విప్ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం ఉదయం 6 గంటలకు 55వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ ఆధ్వర్యంలో బొంగరాలబీడు అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రచారం నిర్వహించారు. మీ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నూరి ఫాతిమా, గుంటూరు ఎంపీగా కిలారి రోశయ్యకు భారీ మెజారిటీని అందించాలని కోరారు. ఈ సందర్భంగా విప్ లేళ్ల అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు జరిగే సాధారణ ఎన్నికలు కావని, వచ్చే ఐదేళ్లలో ఇంటింటి అభివృద్ధి, ప్రతి పేదవాడి భవిష్యత్‌ను నిర్దేశించే చారిత్రాత్మక ఎన్నికలన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ కూడా గుర్తించుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఓటు చేస్తే పథకాలన్నీ కొనసాగింపే.. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలకు ముగింపే.. అన్నది ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో 55వ డివిజన్ అధ్యక్షుడు పులివర్తి రమణయ్య, స్థానిక నాయకులు కాటూరి విజయ్, దొప్పలపూడి అంకాల రాజు, నల్లపు భాను ప్రకాష్, గంగవరపు విజయ్ కుమార్, ముట్లూరి ఆకాశ్, వాసిమళ్ల విజయ్, కె. సత్యనారాయణ, వినుకొండ వినోద్, షేక్ మీరావలి, పువ్వారపు జేమ్స్, గోలి ఆశీర్వాదం, మాతంగి యోగయ్య, నల్లపు రాకేష్, నల్లగట్ల రవి, పెరికా బుజ్జి, మిర్చియార్డు డైరెక్టర్ అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్ గంటా మరియమ్మ, కూరపాటి వరలక్ష్మీ, పెయ్యల సువార్తమ్మ, సైదాబి, నూలి ఎలిజబెత్ రాణి, పలువురు కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి రోశయ్య ప్రచారం


ఎమ్మెల్యే రోశయ్యను సత్కరిస్తున్న వాకర్స్

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య పార్క్‌లో సోమవారం పర్యటించారు. ఉదయం వాకర్స్‌తో కలసి వారితో ముచ్చటించారు. వాకింగ్ ట్రాక్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాకర్స్‌తో కలసి వాకింగ్ చేస్తూ.. వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం కొద్దిసేపు జిమ్ చేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ముచ్చటించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా నిలబడుతున్న తనని, ఏడు నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాకర్స్ కిలారి రోశయ్యను ఘనంగా సత్కరించారు.

డాక్టర్ నరేష్ బాబుకు అంతర్జాతీయ అవార్డు



గుంటూరు మెడికల్: ప్రముఖ సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు మల్లిక స్పైన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జె.నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో సాండియో సిటీలో ఈనెల 15న జరిగిన స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ వారు అవార్డును డాక్టర్ నరేష్ బాబుకు అందజేశారు. ప్రపంచ వ్యాప్తంగా వెన్నుముక పరిశోధనలపై అత్యుత్తమ పరిశోధనా పత్రాలు సమర్పిస్తున్న వారికి స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ వారు ప్రతిష్టాత్మక థామస్ వైట్ క్లవుడ్ అవార్డ్‌ను అందచేస్తున్నారు. భారత దేశం నుంచి 31 సంవత్సరాల్లో మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ అవార్డు అందుకున్న వైద్యుడిగా డాక్టర్ నరేష్‌బాబు రికార్డు సృష్టించారు. సోమవారం గుంటూరు కొత్తపేటలోని మల్లికా స్పైయిన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేష్ బాబు వివరాలు వెల్లడించారు. కాలిఫోర్నియాలో 31వ స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ వార్షిక సమావేశం ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జరిగినట్లు డాక్టర్ నరేష్‌బాబు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 1500 మంది పరిశోధనాత్మక పత్రాలు సదస్సుకు పంపించగా వాటిల్లో సదస్సు నిర్వాహకులు 98 మందిని ఎంపిక చేసి ప్రజెంటేషన్ చేసేందుకు అమెరికాకు పిలిచారని వివరించారు. ప్రజెంట్ చేసిన 98 మందిలో 15 మందిని కమిటీ సభ్యులు ప్రతిష్టాత్మక వైట్‌క్లౌడ్ అవార్డుకు ఎంపిక చేసి నామినేట్ చేశారన్నారు. 15 మందిలో అవార్డుకు నామినేట్ చేయబడిన ఏకైక భారతీయ పరిశోధన పత్రంగా తనకు అవార్డు లభించిందన్నారు. భారత దేశంలో ఇప్పటి వరకు కేవలం రెండు పరిశోధన పత్రాలు మాత్రమే ఎంపిక చేశారని, అవార్డు మాత్రం మొట్టమొదటిసారిగా తనకే దక్కిందన్నారు.

అంకితభావానికి గుర్తింపు


మందపాటిని సత్కరిస్తున్న విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మందపాటి శేషగిరిరావు సోమవారం శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం శేషగిరిరావును విప్ అప్పిరెడ్డి దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేసే మందపాటిని గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమించటం సంతోషదాయకమన్నారు. పార్టీ పట్ల పూర్తి అంకితభావంతో పనిచేసే శేషగిరిరావు తగిన గుర్తింపు లభించిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ కీలకమైన తరుణంలో తననను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కె నరేంద్రరెడ్డి, జాన్ తదితరులు ఉన్నారు.

రూ. 7 లక్షల నగదు స్వాధీనం

గుంటూరు వెస్ట్: ఎన్నికల వేళ నోట్ల కట్టలు బయటపడుతున్నాయి. సోమవారం పేరేచర్ల వద్ద తనిఖీ బృందం అధికారి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.7 లక్షలు పట్టుబడింది. అధికారులు నగదుతో పాటు, వాహనంలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

నిద్ర సమస్యలతో చిరాకు..

- పిల్లల్లోనూ వ్యాధి బాధితులు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు

గుంటూరు అరండల్‌పేటకు చెందిన శ్రీనివాస్(ఊరు, వ్యక్తుల పేర్లు మార్చాం) ఓ ప్రైవేటు కార్యాలయంలో ఉద్యోగి. తాను ఫైల్స్ ముందు వేసుకుని కూర్చోగానే నిద్ర వచ్చేస్తోంది. రాత్రి వేళలో ఇంట్లో నిద్రపోయినా కూడా పట్టపగలే ఆఫీస్‌లో కూడా నిద్రపోతున్నాడు.వైద్యుడిని సంప్రదించగా స్లీప్ అప్నియా అనే వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యసేవలను అందిస్తున్నారు.

శాంతారావు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠాలు చెబుతూ ఉండగానే మధ్యలోనే నిద్రలోకి జారికుంటున్నాడు. పిల్లలు గోల చేస్తే మరలా మెలకువ వచ్చి పాఠాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థంగాక వైద్యులను సంప్రదించగా స్లీప్ అప్నియా అనే వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యంచేస్తున్నారు.



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వలన అనేక మంది స్లీప్ అప్నియా వ్యాధి బారిన పడి అవస్థలు పడుతున్నారు. పెద్దవారు, పిల్లలు అనే తేడా లేకుండా వ్యాధి బాధితులు పెరిగిపోతూ ఉండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కన వారు నిద్రపోలేని విధంగా పెద్దగా గురకపెట్టడం ఈ వ్యాధి లక్షణాలు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయించని పక్షంలో గుండెపోటు వచ్చి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న బాధితులు

గుంటూరు జిల్లాలో న్యూరాలజిస్టులు, ఫిజీషియన్లు, ఈఎన్‌టీ సర్జన్లు 300 మందికి పైగా ఉన్నారు. ఒక వైద్యుడి వద్దకు ప్రతిరోజూ ఇద్దరు లేదా ముగ్గురు స్లీప్ అప్నియా వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. గతంలో కేవలం పెద్దవారిలోనే ఈ సమస్య కనిపించేదని, నేడు పాఠశాలకు వెళ్లే పిల్లల్లో కూడా కనిపించటం ఆందోళన కలిగించే అంశంగా వైద్యులు పేర్కొంటున్నారు. పెద్దవారిలో ప్రతి ఐదుగిరిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య గణంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధి ఉన్నవారు తమకు వ్యాధి ఉన్నట్లు గుర్తించలేరు. తమ భాగస్వామి మాత్రమే వ్యాధి ఉన్నట్లు గుర్తించి చెబితేనే తెలుస్తోంది.

వ్యాధికి కారణాలు...

అధిక బరువు, ధూమపానం, మద్యపానం, మధుమేహం, మెడ చుట్టుకొలత ఎక్కువగా ఉండటం, మెడ పొట్టిగా ఉండటం, పాలిప్స్, టాన్సిల్స్ పెద్దవి అవ్వటం, నాలుక వెనుక భాగం పెద్దది అవ్వటం, చిన్నపిల్లల్లో జంక్‌ఫుడ్స్ తినటం, వ్యాయామం లేకపోవటం, బరువు ఎక్కువగా ఉండటం, టాన్సిల్స్ ఉండటం వల్ల మూడేళ్ల వయస్సులోనే వ్యాధి బారిన పడుతున్నారు.

లక్షణాలు ఇలా....

వ్యాధి సోకిన వారిలో శ్వాసకోశ ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. రాత్రి వేళల్లో పలుమార్లు మూత్రం కోసం నిద్రలేవాల్సి వస్తుంది. నిద్రపోతున్న సమయాల్లో పెద్దగా గురకపెడతారు. ఏకాగ్రత లోపిస్తుంది. డిప్రెషన్‌కు గురవుతారు. నిద్రిస్తున్న సమయంలో నోరు, గొంతు తడిఆరిపోయి ఎండిపోయినట్లు ఉంటుంది. ఉదయం నిద్రలేవగానే తలనొప్పి వస్తుంది. గుండెల్లో మంట, చిరాకు, కోపం ఉంటాయి. రాత్రి వేళల్లో నిద్రాభంగం కలగటంతో పాటుగా ఊపిరితిత్తులకు శ్వాస సక్రమంగా అందక కొన్ని సార్లు గుండెపోటు వచ్చి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. పట్టపగలే తాము పనిచేస్తున్న ప్రదేశాల్లో పని వదిలిపెట్టి నిద్రపోతుంటారు. కొన్ని సార్లు కారు నడుపుతున్న డ్రైవర్లు ఈ జబ్బు వల్లే నిద్రలోకి జారుకుని ప్రమాదాలకు కారణం అవుతుంటారు.


మెడికల్ మేనేజ్‌మెంట్‌తో తగ్గించవచ్చు....



స్లీప్ అప్నియా వ్యాధిని నూటికి 90 శాతం మెడికల్ మేనేజ్‌మెంట్ ద్వారా తగ్గించవచ్చు. స్లీప్ స్టడీ తరువాత వ్యాధి నిర్ధారణ చేసుకుని వైద్యులు ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడాలి. అంతే కాకుండా వైద్యులు చెప్పే సలహాలు, సూచనలు కూడా తప్పనిసరిగా పాటించాలి. ఇంట్లో ఎవరైనా నిద్రలో గురకపెడుతూ ఉంటే భార్య లేదా భర్త సదరు వీడియో, ఆడియోను రికార్డు చేసి వైద్యుడికి చూపించటం ద్వారా వ్యాధిని కచ్చితంగా అంచనా వేస్తారు.

– డాక్టర్ పమిడి ముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు


నివారణ ఇలా....



ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. జీవన విధానంలో మార్పులు చేసుకోవాలి. ఒక పక్కకు తిరిగి పడుకోవాలి. అధిక బరువు తగ్గించుకోవాలి. ధూమపానం, మద్యపానం వీడాలి. పిల్లలకు జంక్‌ఫుడ్స్ పెట్టవద్దు. ఊబకాయానికి గురి కాకుండా ప్రతిరోజూ పిల్లలు ఆటలాడుకునేలా చూడాలి. మంచంపై బోర్లా పడుకోకూడదు.

– డాక్టర్ నరేంద్ర వెంకటరమణ, సీనియర్ ఫిజీషియన్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా పరీక్షలు...



ఉచితంగా స్లీప్ స్టడీ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఒక రాత్రి అంతా రోగి నిద్రపోవాలి. కండరాల కదలికలు, కంటి కదలికలు, హార్ట్ బీట్ పనితీరు, ఊపిరితిత్తుల పనితీరు, రక్తంలో ఆక్సిజన్ శాతం అన్నీ కూడా ఈ పరీక్ష ద్వారా తెలుసుకుని వ్యాధి నుంచి కోలుకోవటానికి వైద్యం అందిస్తాం. ప్రతి నెలా 10 నుంచి 15 మందికి వైద్య పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్